ఆలయాలకు దసరా ఉత్సవ శోభ

- విద్యుత్‌దీపాల వెలుగుల్లో ఆలయాలు
- రేపటి నుంచి 12వ తేదీ వరకు ఉత్సవాలు
- వివిధ రూపాల్లో భక్తులకు దర్శనమివ్వనున్న అమ్మవారు


విద్యుత్ దీపాల అలంకరణలో పెడన కన్యకాపరమేశ్వరి ఆలయం

మచిలీపట్నంటౌన్: దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలకు ఆలయాలు ముస్తాబవుతున్నాయి. ఈ నెల 3వ తేదీ నుంచి నగరంలోని పలు అమ్మవారి ఆలయాల వద్ద దసరా ఉత్సవాలు పెద్ద ఎత్తున నిర్వహించేందుకు ఆలయ కమిటీలు ఏర్పాట్లు పూర్తి చేశాయి. నగరంలోని ఈడేపల్లిలో శక్తిగుడి వద్ద ఏర్పాటు చేసిన అధునాతన విద్యుత్‌దీపాలు ఆకట్టుకుంటున్నాయి. కాళికామాత ఆకృతిలో విద్యుత్‌దీపాల ప్రతిమ చూపరులను కట్టిపడేస్తోంది. ఆలయంతో పాటు ఆలయ పరిసరాల్లో రంగురంగుల విద్యుత్‌దీపాలు ఏర్పాటు చేయటంతో ఆ ప్రాంతమంతా శోభాయమానంగా వెలుగొందుతోంది. బుట్టాయిపేటలోని శ్రీ దత్తాశ్రమంలో 3 నుంచి 12వ తేదీ వరకు శ్రీ దేవి నవరాత్రోత్సవాలు నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తి చేశారు. 10 అడుగుల వారాహి అమ్మవారి విగ్రహాన్ని నెలకొల్పి పూజలు చేయనున్నారు. దత్తాశ్రమ భవనాన్ని రంగురంగుల విద్యుత్ దీపాలతో అలంకరించారు. ప్రధాన రహదారిలో గీతామందిరంలో ఉత్సవాలు ఘనంగా నిర్వహించనున్నారు. ఇప్పటికే అమ్మవారికి కోటికుంకుమార్చన పూజలు నిర్వహిస్తున్నారు. ప్రధాన రహదారిలోని శ్రీ విజయ దుర్గాదేవి ఆలయం ఉత్సవాలకు ముస్తాబైంది. రాజుపేటలోని ముత్యంగుడి, బెల్లంకొట్ల సందులోని మహాలక్ష్మీ అమ్మవారి దేవాలయం, రేవతి సెంటరులోని గంగానమ్మ గుడి, రాబర్ట్‌సన్‌పేటలోని శ్రీ రామలింగేశ్వరస్వామి ఆలయంలో శ్రీ రాజరాజేశ్వరి అమ్మవారికి పూజా కార్యక్రమాలు నిర్వహించనున్నారు.

రేపటి నుంచి దసరా శరన్నవరాత్రులు

పెడన: పట్టణంతో పాటు గ్రామాల్లోని పలు కూడళ్లలోను, అమ్మవారి దేవాలయాల్లోను దేవీశరన్నవరాత్రుల ఉత్సవాలను నిర్వహించడానికి ఆలయ కమిటీలు, యువత చర్యలు చేపట్టారు. పట్టణంలోని శ్రీకన్యకాపరమేశ్వరి ఆలయంలో అక్టోబరు 3 గురువారం ఉదయం 4.30 గంటలకు సుప్రభాత సేవలను విజయదశమి వేడుకలను ప్రారంభించనున్నారు. 3వ తేదీ నుంచి 12వ తేదీ వరకు వివిధ రూపాలలో అమ్మవారిని అలకరిస్తామని ఆలయ నిర్వహక కమిటీ ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు డాక్టర్ కొల్లూరి చిన్నా తెలిపారు. పైడమ్మ దేవస్థానంలో కూడా అమ్మవారిని మొదటి రోజున శ్రీబాలాత్రిపురసుందరిదేవి అలంకరణలో పైడమ్మ భక్తులకు దర్శనమిస్తుందని ఆలయ ఈవో టీవీవీ మోహనరావు పేర్కొన్నారు. మఠం వీధిలో యువత అమ్మవారిని విగ్రహాన్ని ఏర్పాటు చేసి ప్రత్యేక పూజలు నిర్వహించేలా యువత సన్నద్ధమవుతోంది. పైడమ్మ ఘటం గుడిలోను, శ్రీశ్యామలాంబ దేవి ఆలయం, బ్రహ్మపురంలోని చౌడేశ్వరి దేవి ఆలయంలో దేవీశరన్నవరాత్రుల ఉత్సవాలను నిర్వహించనున్నారు.

అవనిగడ్డ: స్థానిక గీతామందిరంలో ఈనెల 3వ తేదీ నుంచి శరన్నవరాత్రి ఉత్సవాలు నిర్వహించనున్నట్లు ఆలయ ధర్మకర్త హరిబాబు తెలిపారు. 12వ తేదీ వరకూ అమ్మవారికి పలు అలంకారాలతో ప్రత్యేక పూజలు నిర్వహిస్తామని చెప్పారు.


దత్తాశ్రమంలో ఏర్పాటు కానున్న 10 అడుగుల వారాహి అమ్మవారి విగ్రహం


శ్రీకాకుళంలో కరపత్రాలు విడుదల చేస్తున్న సర్పంచ్ రవి, కమిటీ సభ్యులు

భక్తులు ఈ కార్యక్రమంలో పాల్గొనాలని కోరారు.

ఆహ్వాన పత్రికల విడుదల

శ్రీకాకుళం(ఘంటసాల): మండలంలోని శ్రీకాకుళంలో శ్రీ ముదిరాజుల రామాలయంలో నిర్వహిస్తున్న 37వ శ్రీ దుర్గా భవాని శరన్నవరాత్రి మహోత్సవ ఆహ్వాన శుభపత్రికలను సోమవారం సాయంత్రం ఆలయ ప్రాంగణంలో ఆలయ కమిటీ సభ్యులతో కలిసి శ్రీకాకుళం సర్పంచ్ ముప్పనేని రవిప్రసాద్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు నిక్కు వీరమహేశ్వరరావు, ఆత్కూరి నాగరాజులు మాట్లాడారు. కమిటీ ప్రతినిధులు కోడి శ్రీనివాసరావు, దానభనేని వెంకటరామాంజనేయులు, రిటైర్డ్ జడ్జి యలమంచి సుబ్బారావు, నడికట్ల బిక్షంరాజు, కోడి సురేష్, దానభనేని శ్రీనివాసులు, బోడి రాఘవరాజు, యర్రభనేని వెంకటేష్, కోడి శివపార్వతి, పోతురాజు లక్ష్మి, యర్రభనేని శారత, బోడి ఇందిర, కమిటీ సభ్యులు పాల్గొన్నారు. ఈ నెల 3 నుంచి 12 వరకు నిర్వహించే ఉత్సవాలను విజయవంతం చేయాలని కోరారు.


దసరా ఉత్సవాలకు ముస్తాబైన ఈడేపల్లి శక్తిగుడి


విద్యుత్ దీపాల వెలుగులో గాంధీబొమ్మ సెంటర్ శివాలయం

‘అంగన్‌వాడీ’ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

బంటుమిల్లి: పెడన నియోజకవర్గంలోని బంటుమిల్లి, కృత్తివెన్ను, పెడన మండలాల్లో ఖాళీగా ఉన్న అంగన్‌వాడీ సహాయకుల పోస్టులను భర్తీ చేయడానికి అర్హులైన మహిళల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ఐసీడీఎస్ బంటుమిల్లి ప్రాజెక్టు సీడీపీవో ఎం.సముద్రవేణి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. పెందుర్రు-2 (ఓసీ), కంచడం-1(ఓసీ), పెన్నమ్మదిబ్బ (బీసీ-ఏ), ఉప్పలూరు (ఓసీ), కొంగంచర్ల (బీసీ-డీ), పైడమ్మ టెంపుల్ ఒకటో వార్డు (ఓసీ), తోటమూల (హెచ్‌సీ) 9వ వార్డు (బీసీ-బీ) రిజర్వేషన్ల వారీగా అర్హులైన మహిళలు దరఖాస్తులను ఈ నెల 10వ తేదీ సాయంత్రంలోపు బంటుమిల్లి ప్రాజెక్టు కార్యాలయంలో అందజేయాలని ఆమె కోరారు.

కృత్తివెన్ను: మండల పరిధిలో అంగన్‌వాడీ కేంద్రాల్లో ఖాళీగా ఉన్న ఆయా (హెల్పర్) పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుద చేశామని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ శ్యామలాగౌరి తెలిపారు. మండలంలోని పెన్నమ్మదిబ్బ (బీసీ-ఏ), ఉప్పులూరు (ఓసీ) క్యాటగిరీలకు చెందిన వారు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. ఈ నెల 10వ తేదీ సాయంత్రం 5 గంటల లోపు ఐసీడీఎస్ బంటుమిల్లి ప్రాజెక్టు కార్యాలయంలో రెండు సెట్ల దరఖాస్తులను అందజేయాలన్నారు. వివరాలకు కార్యాలయంలో సంప్రదించాలన్నారు.

ఘంటసాల/అవనిగడ్డ: మొవ్వ ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలోని ఘంటసాల, చల్లపల్లి, మొవ్వ మండలాల్లో అంగన్‌వాడీ సహాయకుల (ఆయా) పోస్టులకు మంగళవారం నోటిఫికేషన్ విడుదల చేసినట్లు డి.సుధారాణి తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఘంటసాల మండలంలో చిట్టూర్పు- (అంగన్‌వాడీ సెంటర్ నంబర్-4, ఎస్సీ), తాడేపల్లి-1, (బీసీ-బీ), చల్లపల్లి మండలంలోని చల్లపల్లి-4, చల్లపల్లి-10, మొవ్వ మండలంలోని మొవ్వ-3 అంగన్‌వాడీ కేంద్రాల్లో (ఓపెన్ కాంపిటీషన్), మొవ్వ-5 (ఎస్సీ), పెదముత్తేవి-1 (ఓసీ), కాజ-4 (బీసీ-బీ)లకు అంగన్‌వాడీ సహాయకులు (ఆయా) పోస్టులకు దరఖాస్తులు కోరుతున్నట్లు చెప్పారు. దరఖాస్తులను ప్రాజెక్టు కార్యాలయంలో అందించాలని సీడీపీవో సుధారాణి తెలియజేశారు. ఆయా మండలాల్లో అర్హులైన వారు దరఖాస్తు చేసుకోవాలని కోరారు. అర్హత ఉన్న మహిళలు దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

క్లుప్తంగా

వాల్‌పోస్టర్ల ఆవిష్కరణ



అవనిగడ్డ: లంకమ్మ అమ్మవారి ఆలయంలో నిర్వహించే శరన్నవరాత్రి ఉత్సవాల పోస్టర్లను ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ మంగళవారం ఆవిష్కరించారు. అమ్మవారి మూలా నక్షత్రం రోజున అమ్మవారికి చండీహోమం, అన్నసమారాధన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్టు నిర్వాహకులు తెలిపారు. కూనపరెడ్డి దుర్గా వెంకట పరశురామ్, ఏ హరిబాబు, ఎం.పూర్ణ, శివరామకృష్ణ, జీ అనిల్‌కుమార్, అన్నపరెడ్డి వెంకటేశ్వరరావు, యాసం వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

పట్టణ సర్వేయర్ పోస్టు భర్తీ



పెడన: స్థానిక పురపాలక సంఘ కార్యాలయం నూతనంగా ఏర్పాటు చేసిన సమయంలో పట్టణ సర్వేయర్ పోస్టును కేటాయించారు. అయితే ఈ పోస్టులో ఎవరినీ నియమించలేదు. సుమారు 35 సంవత్సరాలకు పైగా ఈ పోస్టు ఖాళీగా ఉంది. తాజాగా ఈ పోస్టులో ఎన్టీఆర్ జిల్లా కార్యాలయం ల్యాండ్ అండ్ సర్వే శాఖలో టాస్క్‌ఫోర్సు సర్వేయర్‌గా విధులు నిర్వహిస్తున్న నాగరాజును నియమించారు. మంగళవారం నాగరాజు పెడన టౌన్ సర్వేయర్‌గా బాధ్యతలను స్వీకరించారు. నాగరాజు మున్సిపల్ చైర్‌పర్సన్ కటకం నాగకుమారి భర్త, సీనియర్ కౌన్సిలర్ కటకం ప్రసాద్‌ను చైర్‌పర్సన్ చాంబరులో మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛాన్ని అందజేశారు.

వెలుగు ఏసీగా రవిబాబు



పెడన: పెడన నియోజకవర్గం వెలుగు ప్రాంతీయ సమన్వయకర్త (ఏరియా కో ఆర్డినేటర్)గా జి.రవిబాబు నియమితులయ్యారు. ఈయన మంగళవారం పెడన ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్‌ను పార్టీ కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి మొక్కను అందజేశారు. ఈయనకు గతంలో పెడనలో ఏసీగా విధులు నిర్వహించిన అనుభవం ఉంది. ప్రస్తుతం ఈయన అవనిగడ్డ నుంచి బదిలీపై పెడనకు మళ్లీ రావడం విశేషం. ఇప్పటి వరకు ఇక్కడ పనిచేసిన పి.కనకారావు గుడివాడకు బదిలీ అయ్యారు. బంటుమిల్లి ఏపీఎంగా విధులు నిర్వహిస్తున్న డి.శ్రీనివాసరావు మోపిదేవికి బదిలీ అయ్యారు. జిల్లా కార్యాలయంలో ఏపీఎంగా ఉన్న వి.దశరథరామ్ కృత్తివెన్ను మండలానికి బదిలీ అయ్యారు.

రేపటిలోగా ఈకేవైసీ చేయించాలి



కృత్తివెన్ను: ఈ పంట నమోదులో ఈకేవైసీ చేయించుకునే రైతులకు ఈ నెల 3వ తేదీ వరకు మాత్రమే అవకాశం ఉందని ఏవో ఎస్.జెన్నీ తెలిపారు. మంగళవారం ఆమె పలు సచివాలయాల్లో ఈకేవైసీ ప్రక్రియను పరిశీలించారు. అనంతరం లక్ష్మీపురం గ్రామంలో ‘పొలంపిలుస్తోంది’ కార్యక్రమం నిర్వహించారు. నాణ్యమైన ఆహార ఉత్పత్తులు సాధించాలంటే సాధ్యమైనంత వరకు సేంద్రీయ ఎరువులనే వాడాలన్నారు.

బ్యాంకు ఉద్యోగుల రక్తదానం



మచిలీపట్నంటౌన్: జాతీయ రక్తదాన దినోత్సవం విజిలెన్స్ అవేర్నెస్ ప్రోగ్రాం లో భాగంగా మంగళవారం యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఉద్యోగులు సిబ్బంది రక్తదానం చేశారు. స్థానిక ప్రధాన రహదారిలోని బ్యాంకు వ్యవస్థాపక బ్రాంచ్ వద్ద ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరాన్ని బ్యాంకు రీజనల్ హెడ్ కే వెంకట్రావు ప్రారంభించారు. ఈ సందర్భంగా యూనియన్ బ్యాంక్ లో పనిచేస్తున్న ఉద్యోగులు సిబ్బంది రక్తదానం చేశారు. ఇండియన్ రెడ్ క్రాస్ వైద్య బృందం రక్తాన్ని సేకరించింది. ఈ కార్యక్రమంలో డెప్యూటీ రీజినల్ హెడ్లు రామలింగారెడ్డి, తాతాజీ, బ్యాంకు విజిలెన్స్ చీఫ్ మేనేజర్ వెంకటరాజు పాల్గొన్నారు.

లడ్డూ వివాదానికి ఇచ్చిన విలువ స్టీల్ ప్లాంటుకు ఇవ్వరా!

- ఎస్‌ఎఫ్‌ఐ, ఏఐఎస్‌ఎఫ్ ఆధ్వర్యంలో దీక్ష
- విశాఖ స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ ఆపాలి



దీక్షలో ఎస్‌ఎఫ్‌ఐ, ఏఐఎస్‌ఎఫ్ నాయకులు

మచిలీపట్నంటౌన్: లడ్డూ వివాదానికి ఇచ్చిన విలువ నేటి పాలకులు విశాఖ ఉక్కును కాపాడటంలో చూపటం లేదని ఎస్‌ఎఫ్‌ఐ, ఏఐఎస్‌ఎఫ్ నాయకులు ఆరోపించారు. విశాఖ ఉక్కు- ఆంధ్రుల హక్కు అనే నినాదంతో ఆ సంఘాల నాయకులు మంగళవారం దీక్ష చేపట్టారు. స్థానిక కోనేరుసెంటర్‌లో ఏర్పాటు చేసిన శిబిరంలో దీక్షలో కూర్చున్న నాయకులు మాట్లాడుతూ విశాఖ ఉక్కు కర్మాగారం 32 మంది విద్యార్థుల బలిదానంతో ఏర్పాటైందన్నారు. కేంద్ర ప్రభుత్వం ఆదానీ, అంబానీలకు అప్పగించే ప్రయత్నం చేయటంలో భాగంగానే నాలుగు వేల మందికి పైగా కార్మికులను విధుల నుంచి తొలగించారన్నారు. నేటి రాష్ట్ర పాలకులు తిరుపతి లడ్డూ వివాదానికే ప్రాధాన్యత ఇస్తూ విశాఖ ఉక్కు నిర్వీర్యానికి కేంద్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంటున్నా పట్టించుకున్న పాపాన పోలేదని దుయ్యబట్టారు. తొలగించిన కార్మికులను మళ్లీ విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు. విశాఖ ఉక్కు ప్లాంట్ ప్రభుత్వ రంగ సంస్థగానే కొనసాగుతుందని ఎన్నికల సమయంలో చంద్రబాబు, పవన్‌కల్యాణ్ హామీ ఇచ్చారన్నారు. అధికారం చేపట్టాక ఈ హామీని విస్మరించి విశాఖ ఉక్కు నిర్వీర్యం అయ్యే దిశగా కేంద్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంటున్నా నోరుమెదపటం లేదన్నారు. విశాఖ స్టీల్ ప్లాంట్‌ను ప్రభుత్వ రంగ సంస్థగా నడపాలని, సెయిల్‌లో విలీనం చేయాలని, సొంత గనులు కేటాయించాలని, ప్రైవేటీకరణ ప్రయత్నాలు ఆపాలని, ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను నిలబెట్టుకోవాలని డిమాండ్ చేశారు. ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి సమరం, అధ్యక్షుడు ప్రేమ్, ఉపాధ్యక్షుడు కీర్తి, ఏఐఎస్‌ఎఫ్ జిల్లా కన్వీనర్ సాధిక్‌బాబు, నాయకులు కార్తీక్, నాని, సంతోష్ తదితరులు పాల్గొన్నారు. వీరికి సీపీఎం మచిలీపట్నం డివిజన్ కార్యదర్శి బూర సుబ్రహ్మణ్యం, సీపీఎం జిల్లా నాయకుడు కొడాలి శర్మ, సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకటేశ్వరరావు మద్దతునిచ్చారు.

బీఎస్‌ఎన్‌ఎల్ ఉద్యోగుల ర్యాలీ



మచిలీపట్నంటౌన్: భారతీయ సంచార్ నిగమ్ లిమిటెడ్ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ఆ సంస్థ ఉద్యోగులు నగరంలో మంగళవారం ర్యాలీ నిర్వహించారు. స్థానిక బుట్టాయిపేటలోని బీఎస్‌ఎన్‌ఎల్ కార్యాలయం వద్ద నుంచి రాజాగారి సెంటరు మీదుగా కోనేరుసెంటర్ వరకు ర్యాలీ నిర్వహించారు. బీఎస్‌ఎన్‌ఎల్ ద్వారా అమలు చేస్తున్న పలు సర్వీసుల వివరాలను తెలుపుతూ నినాదాలు చేశారు. జిల్లా వ్యాప్తంగా బీఎస్‌ఎన్‌ఎల్ 4జీ సేవలు అందించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసిందని, అన్ని గ్రామాల్లో, పట్టణాల్లో ఫైబర్ ఇంటర్‌నెట్ సరీ్వసులు అందించటం జరుగుతోందని, కొత్తగా డిస్నీ హాట్‌స్టార్‌తో పాటు పలు ప్రముఖమైన ఓటీటీలు అందుబాటులోకి వచ్చాయని వివరించారు. బీఎస్‌ఎన్‌ఎల్ ఫైబర్ సర్వీసుల కోసం తమ కార్యాలయానికి వినియోగదారులు వచ్చి దరఖాస్తు చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీఎస్‌ఎన్‌ఎల్ ఉద్యోగులు, టెలీకాం ఇన్‌ఫ్రా సర్వీస్ ప్రొవైడర్లు ర్యాలీలో పాల్గొన్నారు.

బీసీ నేత మృతికి మాజీ ఎమ్మెల్యే సంతాపం


వనమాల భౌతికాయానికి శ్రద్ధాంజలి ఘటిస్తున్న అవనిగడ్డ మాజీ ఎమ్మెల్యే రమేష్‌బాబు

సొర్లగొంది(నాగాయలంక): మండల వైఎస్సార్ సీపీ బీసీ నేత, గ్రామ సర్పంచ్ నాంచారమ్మ భర్త వనమాల గాలిదేవుడు (67) భౌతికకాయాన్ని అవనిగడ్డ మాజీ ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు సందర్శించి శ్రద్ధాంజలి ఘటించారు. ఆయన భార్య వనమాల నాంచారమ్మ గ్రామ సర్పంచ్‌గా ఉన్నారు. కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఆయన వెంట రాష్ట్ర కాపు కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ మద్ది చిన్నారి నాగాయలంక, అవనిగడ్డ మండలాల పార్టీ నాయకులు పాల్గొని గాలిదేవుడి భౌతికాయానికి నివాళులర్పించారు.

ప్రభుకుమార్‌కు నివాళి

కొక్కిలిగడ్డ(మోపిదేవి): విశ్రాంత లీగల్ మెట్రాలజీ డెప్యూటీ కంట్రోలర్ రాయన ప్రభుకుమార్ (67) భౌతికకాయాన్ని అవనిగడ్డ మాజీ ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు మంగళవారం సందర్శించి ఘనంగా నివాళులర్పించారు. హైదరాబాద్‌లో సోమవారం ఉదయం ప్రభుకుమార్ మృతి చెందిన సంగతి తెలిసిందే. వారి స్వగ్రామం మండలంలోని కొక్కిలిగడ్డకు భౌతికకయాన్ని తరలించారు. విషయం తెలుసుకున్న సింహాద్రి మృతదేహాన్ని సందర్శించి పూలదండలు వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించారు. అనంతరం నిర్వహించిన అంతిమ యాత్రలో గ్రామస్తులు పెద్ద పాల్గొన్నారు. దారి పొడవునా జోహార్లు అర్పించారు. మృతుని తండ్రి రాయన సాంబశివరావు కొక్కిలిగడ్డ గ్రామ మాజీ సర్పంచ్‌గా పనిచేశారు. ఆయన వెంట మండల పార్టీ కన్వీనర్ గరికిపాటి వెంకటేశ్వరావు, జిల్లా కార్యదర్శి మోర్ల శ్రీనివాసరావు, పీఏసీఎస్ మాజీ చైర్‌పర్సన్‌లు రాయన శంకరరావు, తుటారం కృష్ణ, గ్రామ పార్టీ కన్వీనర్‌లు రాయన సత్యనారాయణ, మత్తి వెంకట రాజాచంద్, కేసాని సుబ్రహ్మణ్యం, పెద్ద ఎత్తున పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

‘వాల్టా’ కేసు నమోదు



ఎస్ఐ రాజేష్ స్వాధీనంలో ఇసుక టిప్పర్, డ్రైవర్

నాగాయలంక: అవనిగడ్డ మండలంలోని బందలాయిచెర్వు గ్రామం నుంచి నాగాయలంక వైపు అనుమతులు లేకుండా ఇసుక తరలిస్తున్న టిప్పర్‌ను సోమవారం రాత్రి పట్టుకుని వాల్టా చట్టం కింద కేసు నమోదు చేసినట్లు ఎస్.ఐ కలిదిండి రాజేష్ మంగళవారం తెలిపారు. విశ్వసనీయ సమాచారం మేరకు సిబ్బందితో కలిసి వెళ్లి వక్కపట్లవారిపాలెం లాకుల వద్ద మెయిన్ రోడ్డుపై టిప్పర్ డ్రైవర్ మేరుగ రామకృష్ణ వాహనాన్ని తనిఖీ చేయగా అక్రమంగా ఇసుక తరలిస్తున్నట్లు గర్తించామన్నారు. టిప్పర్ డ్రైవర్ ఎలాంటి అనుమతులు చూపని కారణంగా వాహనాన్ని ఇసుకతో సహా స్టేషన్‌కు తరలించి వాల్టా కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ చెప్పారు.

నాగాయలంక: మండలంలోని దిండి గ్రామం నుంచి నాగాయలంక వైపు ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను పట్టుకుని మండల తహసీల్దార్ కార్యాలయానికి అప్పగించినట్లు ఎస్.ఐ కలిదిండి రాజేష్ మంగళవారం తెలిపారు. రేమావారిపాలెం వద్ద మెయిన్ రోడ్డుపై ట్రాక్టర్ యజమాని, డ్రైవర్ అయిన చెన్ను పూర్ణ వీరరాఘవరావు ఇసుక తరలిస్తుండగా పత్రాల కోసం తనిఖీ జరుపగా అక్రమంగా ఇసుక తరలిస్తున్నట్లు గర్తించామన్నారు. వాహనాన్ని తొలుత స్టేషన్‌కు తరలించామని, రికార్డు నమోదు చేసి తహసీల్దార్ కార్యాలయంలో అప్పగించామని ఎస్ఐ చెప్పారు.

ఘనంగా ప్రపంచ వృద్ధుల దినోత్సవం

అవనిగడ్డ: స్థానిక పెన్షనర్స్ అసోసియేషన్ భవనంలో ప్రపంచ వృద్ధుల దినోత్సవాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. అసోసియేషన్ అధ్యక్షుడు ఎం.రామకృష్ణ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో అసోసియేషన్ కార్యదర్శి అబ్దుల్‌అజీజ్, సీనియర్ నాయకులు సీహెచ్‌ఎస్ఆర్‌కె.ప్రసాద్ మాట్లాడుతూ ప్రభుత్వం వృద్ధులకు ఇచ్చే పెన్షన్ పెంచాలని, ఆరోగ్య భద్రత కల్పించాలని, కుటుంబంలో 60 సంవత్సరాలు దాటిన వారందరికీ పెన్షన్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా కొంతమంది సీనియర్ పెన్షనర్స్‌ని సత్కరించారు. అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు కె.నాగేశ్వరరావు, ఉపాధ్యాయ పత్రిక సంపాదకులు వై.నేతాంజనేయప్రసాద్, ఆర్గనైజింగ్ కార్యదర్శి కె.సుధాకరరావు, పలువురు వృద్ధులు పాల్గొన్నారు.

జిల్లా స్థాయి పోటీలకు ఎంపిక


ఎంపికైన విద్యార్థులతో కరస్పాండెంట్, వ్యాయామ ఉపాధ్యాయుడు

కోడూరు: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నియోజకవర్గ స్థాయిలో జరిగిన క్రీడా పోటీల్లో కోడూరు లక్ష్య ఇంగ్లిష్ మీడియం స్కూల్ విద్యార్థులు ప్రతిభ కనబర్చి జిల్లాస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. వివిధ విభాగాల్లో పాఠశాల నుంచి 16 మంది విద్యార్థులు జిల్లాస్థాయి పోటీల్లో పాల్గొంటారని కరస్పాండెంట్ విస్సంశెట్టి శివనాగరాజు తెలిపారు. అండర్-14 బాలుర విభాగంలో ఖోఖో పోటీల్లో విద్యార్థులు కోలా లోకేష్, సీహెచ్.ప్రవీణ్‌పాల్, కబడ్డీ పోటీల్లో పి.అయ్యప్ప, పి.డానియల్, వాలీబాల్ పోటీల్లో పి.అయ్యప్ప, డానియల్, సాయిరామ్, లోకేష్, షటిల్ బ్యాడ్మింటన్‌లో లోకేష్ సత్తాచాటి జిల్లా స్థాయికి ఎంపికైనట్లు శివనాగరాజు తెలిపారు. అండర్-14 బాలికల విభాగంలో కబడ్డీలో జ్యోత్స్న, ఖోఖోలో రేష్మ, నందిని, అలేఖ్య, అండర్-17 సీనియర్ విభాగంలో ఖోఖోలో గాదె అక్షయ, గాయత్రి, కబడ్డీ కావ్య, బ్యాడ్మింటన్‌లో అక్షయ జిల్లాస్థాయికి ఎంపికైనట్లు చెప్పారు. ప్రతిభ కనబర్చిన విద్యార్థులతో పాటు శిక్షణ ఇచ్చిన వ్యాయామ ఉపాధ్యాయుడు శొంఠి గంగాధరరావును పాఠశాల యాజమాన్యం అభినందించింది.

పాఠశాలలో వాటర్ ట్యాంకు ప్రారంభం


పాఠశాలలో మౌలిక వసతులను ప్రారంభిస్తున్న రంగనాథబాబు, అరుణ్ దంపతులు

ఘంటసాల: మండలంలోని పెద్దగూడెంలో మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో అంబేడ్కర్ నగర్‌కు చెందిన గొరుముచ్చు నాంచారయ్య చారిటబుల్ ట్రస్టు అధినేత గొరుముచ్చు అరుణ్ కుమార్ ఆర్థిక సహకారం రూ.75 వేలతో నిర్మించిన వాటర్ ట్యాంక్, హ్యాండ్ వాష్ బేసిన్, ఇతర మౌలిక వసతులను ఎన్నారై రంగనాథ బాబు, గొర్రెపాటి సురేంద్ర బాబు దంపతులు, ట్రస్టు అధినేత అరుణ్, లలిత దంపతులతో కలిసి సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా రంగనాథ బాబు మాట్లాడుతూ విద్య ద్వారానే పేదరికాన్ని జయించానన్నారు. పాఠశాలలో మౌలిక వసతులు కల్పించిన అరుణ్ కుమార్ దంపతులను అభినందించారు. అనంతరం దాతలు, అతిథులను గ్రామ పెద్దలు, గ్రామస్తులు దుశ్శాలువాలు, పూలమాలలతో సత్కరించి మెమెంటోలు అందించారు. పాఠశాల ప్రాంగణంలో మొక్కలు నాటారు. జెడ్పీ మాజీ వైస్ చైర్మన్ గొర్రెపాటి రామకృష్ణ, ఎంపీటీసీ దిరిశం వెంకటలక్ష్మి, పాఠశాల హెచ్ఎం ఎస్.శ్యామల దేవి, పేరెంట్స్ కమిటీ చైర్మన్ తోడేటి ఉషారాణి, వైస్ చైర్మన్ తూము బాల భాస్కరరావు, తల్లిదండ్రులు, గ్రామస్తులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కళాశాలలో గాంధీ జయంతి

బంటుమిల్లి: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మంగళవారం ఇన్‌చార్జ్ ప్రిన్స్‌పాల్ జయరాజు అధ్యక్షతన చరిత్ర శాఖాధిపతి సుజాత ఆధ్వర్యంలో ముందుగా గాంధీజయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. గాంధీ స్వాతంత్ర్య సమరంలో చేసిన త్యాగాలను స్మరించుకున్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల విద్యార్థులు భవితా కేంద్రంలోని చిన్నారులకు పండ్లు, స్వీట్లు, బిస్కెట్లు అందజేశారు. విద్యార్థులు ఏర్పాటు చేసిన ఫొటో ఎగ్జిబిషన్ ఆకట్టుకుంది.

ఈకేవైసీ పూర్తయితేనే ధాన్యం కొనుగోలు



తెలుగురావుపాలెం(ఘంటసాల): ఈకేవైసీ పూర్తయిన రైతుల ధాన్యం మాత్రమే కొనుగోలు చేస్తామని ఎంఏవో కె.మురళీకృష్ణ అన్నారు. మండలంలోని తెలుగురావు పాలెం, చినకళ్లేపల్లి గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏవో మురళీకృష్ణ మాట్లాడుతూ మండలంలో ఇప్పటి వరకు 18,769 ఎకరాల్లో ఈ క్రాప్ నమోదు అయిందని, రైతులందరూ ఈ నెల 3వ తేదీ లోపు ఈకేవైసీ చేయించుకోవాలని తెలిపారు. మండల పశు వైద్యాధికారి డాక్టర్ పి.మనోజ్ కుమార్ మాట్లాడుతూ జాతీయ బ్యాంకుల ద్వారా మినీ గోకులం ఏర్పాటుకు ఒక పశువుకు రూ.80 వేల చొప్పున ముద్ర రుణం మంజూరు చేస్తామని చెప్పారు. తెలుగురావురావుపాలెం, చినకళ్లేపల్లి సర్పంచులు రాచూరి ప్రసాద్ బాబు, గుత్తికొండ రామారావు, సెరికల్చర్ ఆఫీసర్ శ్రీనివాసరావు, వీఏఏ జి.రవిచంద్ర, రైతులు పాల్గొన్నారు.

పట్టభద్రుల ఓటర్ల నమోదుపై అవగాహన

నాగాయలంక: మండలంలో అర్హులైన పట్టభద్రులు ఓటర్లుగా నమోదు చేసుకోవాలని కోరుతూ జనసేన ఏపీ సెంట్రల్ జోన్ కమిటీ సభ్యుడు బడ్రెడ్డి మల్లికార్జునరావు, జిల్లా తెలుగు మహిళ అధ్యక్షురాలు తలశిల స్వర్ణలత ఆధ్వర్యంలో మంగళవారం ప్రచారం జరిపారు. స్థానిక విద్యాసంస్థలలో ఉపాధ్యాయులను కలిసి ఓటు నమోదుపై అవగాహన కల్పించారు. కృష్ణా, గుంటూరు పట్టభద్రుల నియోజకవర్గ ఎన్నికలు త్వరలో జరుగబోతున్నందున అర్హత కలిగిన ఓటర్లు నమోదు కోసం ఫారం-18ను సంబంధిత ధ్రువీకరణ పత్రాలతో తహసీల్దార్ కార్యాలయంలో అందించాలని సూచించారు. పీఏసీఎస్ మాజీ డైరెక్టర్ తలశిల శిరామకృష్ణ, బోనం పాపారావు, వడ్లమూడి రామకృష్ణ, తోట రత్నారావు తదితరులు పాల్గొన్నారు.